
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

ఆదివారం 4 ఆగస్టు 2024

బొర్రా గుహలు పరిరక్షణకు చర్యలు

- రైల్వేట్రాక్ అలైన్‌మెంట్‌పై లోక్‌సభలో ప్రస్తావిస్తా
- అరకులోయ ఎంపీ తనుజారాణి



అరకులోయ, ఆగస్టు 3: సహజసిద్ధ బొర్రాగుహలు పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి తెలిపారు. ఈ విషయమై లోక్‌సభలో ప్రస్తావించనున్నట్టు చెప్పారు. శనివారం అరకులోయ విలేకర్లతో ... మిగతా 8వ పేజీలో

188 పాఠశాలల భవిష్యత్తు ఏమిటీ?

పది మంది లోపు విద్యార్థులున్న స్కూళ్లను ఎత్తేస్తారా.. బలోపేతం చేస్తారా..

- తర్జనభర్జన పడుతున్న విద్యాశాఖ అధికారులు
- ఎత్తేస్తారని అనుమానాలు వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



పది మంది లోపు విద్యార్థులున్న జి.మాడుగుల మండలం సింగర్బ ప్రాథమిక పాఠశాల

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

జిల్లాలో పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. ఈ పాఠశాలల పరిస్థితి ఏమిటనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. తక్కువ విద్యార్థులున్న వాటిని ఇతర పాఠశాలల్లో విలీనం చేయాలా? లేదా వాటిలోనే విద్యార్థుల సంఖ్య పెంచాలా? అనే దానిపై విద్యాశాఖాధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దీంతో ఆయా పాఠశాలలను ఏమి చేస్తారనే దానిపై తల్లిదండ్రుల్లోను, ఉపాధ్యాయ సంఘాల్లోను చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్ర వ్యాప్తంగా పది మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాల వారీగా పదిలోపు విద్యార్థులున్న పాఠశాలల వివరాలను జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా సేకరించింది. ఆయా పాఠశాలలను ఏమి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం వివరాలు సేకరించిందనేది స్పష్టత లేకుండా పోయింది. ఇటీవల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఒక సమావేశంలో.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నచోట్ల మరింత మంది విద్యార్థులు చేరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే గతంలో వైసీపీ ప్రభుత్వం జీవో 117 జారీ చేసి, అనేక చోట్ల పాఠశాలల్ని ఎత్తేసిందని, తమ ప్రభుత్వం పాఠశాలలన్ని పటిష్ఠం చేస్తుందని ప్రకటించారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు. కాని ఉపాధ్యాయ సంఘాల నేతలు అందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్ని ఎత్తేయాలనే ఆలోచనతోనే ప్రభుత్వం వివరాలను సేకరించిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 188 పాఠశాలలు గుర్తింపు

జిల్లాలోని 22 మండలాల పరిధిలో పది మందిలోపు విద్యార్థులున్న 188 పాఠశాలలున్నాయని, వాటిలో 1,508 మంది విద్యార్థులున్నారని అధికారులు గుర్తించారు. జిల్లాలో అడ్డతీగల మండలంలో 6, అనంతగిరిలో 17, అరకులోయలో 5, చింతపల్లిలో 7, చితూరులో 9, దేవీపట్నంలో 3, డుంబ్రిగుడలో 4, జీకేవీధిలో 10, జి.మాడుగులలో 11, గంగవరంలో 1, హుకుంపేటలో 15, కొయ్యూరులో 22, కూనవరంలో 8, మారేడుమిల్లిలో 7, ముంచంగిపుట్టులో 8, ఏటపాకలో 6, పాడేరులో 7, పెదబయలులో 7, రాజవొమ్మంగిలో 10, రంపచోడవరంలో 2, వీఆర్.పురంలో 2, వై.రామవరంలో 15 పాఠశాలలున్నాయి. జిల్లాలో అత్యధికంగా కొయ్యూరు మండలంలో 22 ఉండగా, గంగవరం మండలంలో ఒకటి మాత్రమే పదిమందిలోపు విద్యార్థులున్న పాఠశాలలున్నాయి.

స్కూళ్లు బలోపేతం చేస్తేనే మేలు

ప్రైవేటు విద్యాలయాలు అంతగా లేకపోవడంతో గిరిజనులు నూటికి నూరుశాతం ప్రభుత్వ విద్యపైనే ఆధారపడతారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పది మందిలోపున్న పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా గిరిజనులకు మేలు జరుగుతుందని విద్యావేత్తలు అంటున్నారు. అలాగే ఆయా పాఠశాలలు మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో పాటు ఇతర పాఠశాలలు వాటికి దూరంగా ఉన్నాయి. ఏదైనా కారణాలతో ఈ పాఠశాలలను ఎత్తేస్తే, అందులోని విద్యార్థులు దూరంగా ఉన్న ఇతర స్కూళ్లకు వెళ్లలేక డ్రాపవుట్స్ అయ్యే ప్రమాదముంది. అందువల్ల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి ఏజెన్సీలోని స్కూళ్లను పటిష్ఠం చేసేందుకే ప్రభుత్వం మొగ్గు చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పట్టాలెక్కనున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు

పర్యావరణ అనుమతులు మంజూరు

- సీలేరు ఖాతాలో చేరనున్న మరో 1,350 మెగావాట్లు
- ఇప్పటికే ప్రాజెక్టుకు ఎస్‌ఈ, ఏడీఈలు, ఏఈఈ నియామకం
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటు చేసే ప్రదేశంలో సర్వే చేస్తున్న నిపుణుల బృందం

సీలేరు, ఆగస్టు 3:
సీలేరులో జెన్‌కో ప్రతిపాదించిన 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు కావడంతో త్వరలో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. ఈ ప్రాజెక్టు వినియోగంలోకి వస్తే రాష్ట్రంలో సీలేరు కాంప్లెక్సు జల విద్యుదుత్పత్తిలో అగ్రస్థానానికి చేరనుంది. జీకేవీధి మండలం సీలేరు (ఎగువ సీలేరు)లో 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం)కు ప్రతిపాదనలు చేసి, సర్వే నిర్వహించారు. అప్పటి జెన్‌కో డైరెక్టర్ ఆదిశేషు నేతృత్వంలో నిపుణుల బృందం డొంకరాయి నుంచి సీలేరు వరకు ప్రాజెక్టు నిర్మాణానికి అనువైన ప్రాంతం కోసం సర్వే నిర్వహించారు. చివరకు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సీలేరు అనుకూలమని నిర్ధారించారు. ఈ మేరకు వ్యాప్‌కోస్ సంస్థకు ప్రాజెక్టు డిజైన్, డీపీఆర్ పనులను జెన్‌కో అప్పగించింది. ఈ ప్రాజెక్టు పూర్తిగా భూగర్భంలో నిర్మించే ప్రాజెక్టు కావడంతో మొదటిగా వ్యాప్‌కోస్ సీలేరు నుంచి శాండికోరి వరకు భూగర్భంలోని రాక్ పటిష్ఠతపై పరీక్షలను నిర్వహించింది. ఈ ప్రాజెక్టును 1,350 మెగావాట్ల సామర్థ్యంతో వ్యాప్‌కోస్ డిజైన్ చేసింది. ఇందుకు రూ.12 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం గత ఏడాది ఏప్రిల్ ఒకటిన సీలేరులో ప్రజాభిప్రాయ సేకరణను జెన్‌కో అధికారులు నిర్వహించారు. ప్రాజెకుకు అనుకూలంగా ప్రజాభిప్రాయ సేకరణ ఉండడంతో నిర్మాణానికి జెన్‌కో చర్యలను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ, అటవీ అనుమతులు మినహా ఇతర అన్ని అనుమతులు గత ప్రభుత్వ హయాంలోనే మంజూరు కావడంతో ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పనులు గత ఏడాదే పూర్తయ్యాయి. కీలకమైన పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ శాఖ మంజూరు చేయడంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడానికి గ్రీన్‌సిగ్నల్ పడింది.

సీలేరులో కార్యాలయాలు ఏర్పాటుకు సన్నాహాలు

సీలేరులో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి నాలుగు నెలల క్రితమే ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను (చంద్రశేఖర్ రెడ్డి) నియమించారు. ఇటీవల మాచ్‌ఖండ్, డొంకరాయిల నుంచి ఇద్దరు ఏడీఈలు, సీలేరు క్యాంప్ సెక్షన్ నుంచి ఒక ఏఈఈని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు బదిలీ చేశారు. ప్రస్తుతం వీరు స్థానిక సివిల్ ఎస్‌ఈ కార్యాలయం నుంచి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం కోసం ప్రాజెక్టు ఎస్‌ఈ సన్నాహాలు చేస్తున్నారు. కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుంది.. రాబోయే రోజుల్లో ఇంజనీర్లు, సిబ్బంది పెరిగితే వారికి వసతులు, సౌకర్యాలు వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నారు.

సీలేరు కాంప్లెక్సులో పెరగనున్న విద్యుత్ సామర్థ్యం

సీలేరు కాంప్లెక్సు పరిధిలో ... మిగతా 8వ పేజీలో

డీఎస్‌సీ ఉచిత కోచింగ్‌కు ఏర్పాట్లు చేయండి

అధికారులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశం

- 300 మంది గిరిజన అభ్యర్థులకు అవకాశం



అధికారులతో సమావేశమైన ఐటీడీఏ పీవో వి.అభిషేక్

పాడేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో గిరిజన అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. డీఎస్‌పీ ఉచిత కోచింగ్‌పై శనివారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్‌సీకి ప్రిపేరవుతున్న గిరిజన నిరుద్యోగులకు ఉపయోగపడేలా కోచింగ్ ఇవ్వాలన్నారు. అలాగే ఏజెన్సీ వ్యాప్తంగా 300 మంది గిరిజన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉచిత కోచింగ్‌కు డిగ్రీ, బీఈడీ, డీఈడీ, టెట్‌ల్లో సాధించిన మార్కుల ఆధారంగా లేదా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అలాగే మహిళలకు నిబంధనల మేరకు రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక విధానం, శిక్షణ కేంద్రం, ఎంత కాలం శిక్షణ అందిస్తామనే పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని పీవో అభిషేక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీవోలు వీఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

జిల్లాను గంజాయి రహితం చేద్దాం

- జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్




మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాను గంజాయి రహితం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో మోటార్ యూనియన్ ప్రతినిధులు, వాహన డ్రైవర్లు, యజమానులు, ఆర్టీసీ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా చట్టపరంగా నేరమని, దానిని సంపూర్ణంగా అరికట్టేందుకు పోలీసు శాఖకు అందరూ సహకరించాలన్నారు. అలాగే గంజాయిపై ఎటువంటి సమాచారం అందినా తమకు తెలియజేయాలన్నారు. గంజాయి నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. తాము గంజాయిని అరికట్టేందుకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని సమావేశానికి హాజరైన వారందరూ ఎస్పీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్పీ కె.ధీరజ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎల్.హిమగిరి, స్థానిక సీఐ డి.నవీన్‌కుమార్, ఎస్‌ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరు జలాశయాల్లో ఆశాజనకంగా నీటి నిల్వలు

- విద్యుదుత్పత్తి, గోదావరి డెల్టాలో రబీ పంటలకు నీటి కొరత ఉండదు
- జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి

బలిమెల, జోలాపుట్, గుంటవాడ, డొంకరాయిల్లో 82 టీఎంసీలు



నీటితో కళకళలాడుతున్న డొంకరాయి జలాశయం



విలేకర్లతో మాట్లాడుతున్న జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి

సీలేరు, ఆగస్టు 3:
సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయని ఏపీ జెన్‌కో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో ఇదే తరహాలో వర్షాలు కొనసాగితే బలిమెల జలాశయం కూడా పూర్తిస్థాయికి చేరిందన్నారు. బలిమెల పూర్తిస్థాయికి చేరితే సీలేరు కాంప్లెక్సులో విద్యుదుత్పత్తికి ఏడాది పొడవునా నీటి సమస్య ఉండదన్నారు. అలాగే రబీ సీజన్‌లో గోదావరి డెల్టాకు కూడా పుష్కలంగా సీలేరు నీటిని విడుదల చేయవచ్చునన్నారు. బలిమెల జలాశయంలో 95 టీఎంసీల నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 45 టీఎంసీలకు నీరు చేరిందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి బలిమెలలో 26 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా జోలాపుట్‌లో 31.5 టీఎంసీలు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా, ప్రస్తుతం 21 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 6 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉందన్నారు. గుంటవాడ జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరిందన్నారు. ఇక్కడ నుంచి నీటిని వృథాగా దిగువకు వదిలిపెట్టకుండా సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నామన్నారు. అవసరమైతే సీలేరులో రెండు యూనిట్ల ద్వారా కూడా విద్యుదుత్పత్తిని చేస్తున్నామన్నారు. డొంకరాయి జలాశయంలో 13.5 టీఎంసీలు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా, ప్రస్తుతం ఇక్కడ 13 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. డొంకరాయికి 8 వేలు క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండడంతో 4వేలు క్యూసెక్కులు విద్యుదుత్పత్తికి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నామన్నారు. మరో 4 వేల క్యూసెక్కులు జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేసి నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గర్భిణికి తప్పని తిప్పలు

కడుపులో కదలికలు లేని బిడ్డ

- వంట పాత్రలో గర్భిణిని గెడ్డను దాటించిన కుటుంబ సభ్యులు
- రూడకోట పీహెచ్‌సీ తరలింపు
- డాక్టర్ పరీక్షించి తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారణ
- అసంపూర్తి వంతెన పూర్తిచేయాలని గెడ్డ అవతల గ్రామాల గిరిజనుల వేడుకోలు



గర్భిణిని వంట పాత్ర సాయంతో ఉధృతంగా ప్రవహిస్తున్న జామిగూడ గెడ్డ దాటిస్తున్న కుటుంబీకులు

పెదబయలు, ఆగస్టు 3:
మండలంలో జామిగూడ-గుంజివాడ వంతెన నిర్మాణం అసంపూర్తిగా విడిచిపెట్టడంతో గెడ్డ అవతల గల ఆరు గ్రామాల గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వర్షాకాలం మూడు నెలలు ఆ గిరి గ్రామాలకు రాకపోకలు దాదాపు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అత్యవసరాల్లో ఆనప డిప్పలు, పసుపు ఉడక బెట్టే సిల్వర్ పాత్రల సాయంతో వాగు దాటుతున్నారు. శనివారం గెడ్డ అవతల గల గుంజివాడ గ్రామానికి చెందిన ఎనిమిది నెలల గర్భవతి పాంగి రాజేశ్వరిని పీహెచ్‌సీకి తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు అవస్థలు పడ్డారు. బిడ్డ కదలిక లేకపోవడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వాహనం జామిగూడ వరకు వచ్చింది. దీంతో సిల్వర్ వంట పాత్రలో గర్భిణిని కూర్చొబెట్టి కుటుంబ సభ్యులు ఆనప డిప్పలు కట్టుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటించారు. అనంతరం అంబులెన్స్‌లో రూడకోట పీహెచ్‌సీకి చేర్పించారు. అక్కడ వైద్యులు సత్యారావు ఆమెను పరిశీలించి, తల్లీబిడ్డ ఆరోగ్యంగానే ఉన్నారని నిర్ధారించారు. నిలిచిపోయిన వంతెన నిర్మాణం ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు



పాడేరు మండలం మినుములూరు కూడలి వద్ద పోలీసుల వాహన తనిఖీలు

పాడేరు/చింతపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. జూలై 28వ తేదీన ప్రారంభమైన వారోత్సవాల్లో ఈ ఏడాది ఏవోబీలో హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోలేదు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సరిహద్దు అడవుల్లో గాలింపును ముమ్మరంగా చేశారు. ప్రధాన రహదారులు, కల్వర్టులు, వంతెనల వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు, ప్రధాన కేంద్రాల్లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోని ప్రవేశించే అనుమానితులపైనా పోలీసులు నిఘా పెట్టారు. శనివారం పాడేరు మండలంలో మినుములూరు, చింతలవీధి, నక్కలపుట్టు, గొందూరు ప్రాంతాల్లో శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఈ ఏడాది మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులు, ఇటు మారుమూల గిరిజనులు ఊపిరిపీల్చుకున్నారు.

క్రైం... crime news

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

హుకుంపేట ఆగస్టు 3: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం హుకుంపేట సాయిబాబు వీధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక సాయిబాబు వీధికి చెందిన మజ్జి కృష్ణ(34), సుజాత దంపతుల కుమారుడు ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో కృష్ణ అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. శుక్రవారం ఎవరూ ఇంట్లో లేని సమయంలో దూలానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఆరు గంటలకు పనుల నుంచి ఇంటికి వచ్చి అతని భార్య సుజాత ఎన్నిసార్లు పిలిచినా తలుపు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో బలవంతంగా తలుపులు తెరిపించింది. దూలానికి ఉరివేసుకుని ఉన్న కృష్ణ మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం కేసు నమోదు చేసి మృతదేహానికి పాడేరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

» వివాహిత అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

డుంబ్రిగుడ, ఆగస్టు 3: మండలంలోని బల్లుగుడ సమీపంలో గత నెల 31న అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటనపై దర్యాప్తు చేయగా ఆమె భర్తే హతమార్చినట్టు తేలిందని స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. డుంబ్రి గుడ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 31న బల్లుగుడ గ్రామానికి చెందిన నిందితుడు శెట్టి రాజ్‌కుమార్ తన భార్య దేవిని హత్య చేసి పరారయ్యాడన్నారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా, ఆమె భర్త హత్య చేసినట్టు దర్యాప్తులో రుజువు కావడంతో ఒడిశా వైపు నుంచి వస్తున్న అతనిని జైపూర్ జంక్షన్‌లో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంతోశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా

» ప్రమాదం నుంచి బయటపడిన డ్రైవరు



బీఎన్ రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో తాచేరు వంతెన సమీపంలో శనివారం ట్రాక్టరు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నుంచి డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వీరవల్లి అగ్రహారానికి చెందిన డ్రైవరు నానాజీ విజయరామరాజుపేటలో వరి పొలం దమ్ము కైసెట్‌తో బీఎన్ రోడ్డుపై వడ్డాది నుంచి ట్రాక్టరుతో వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారి ఇచ్చే క్రమంలో రోడ్డు పక్కగా ట్రాక్టరును పోనిచ్చాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాగా తడిసి ఉండడంతో రోడ్డు చివర జారిపోవడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ పక్కనే గుంతలోకి బోల్తా పడింది. ట్రాక్టర్ కింద చిక్కుకున్న డ్రైవర్‌ను వాహనదారులు బయటకు తీశారు. ప్రమాదం నుంచి నానాజీ బయట పడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భార్యను గాయపరిచిన భర్త అరెస్టు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 3: మండలంలోని కోనేపాలెంలో భార్యను కత్తితో గొంతు కోయడానికి ప్రయత్నించిన భర్తను అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్టు స్థానిక సీఐ ఎం.బుచ్చిరాజు తెలిపారు. జూలై 30న రాత్రి సమయంలో భార్య భారతిని భర్త వినయ్ కత్తితో గాయపరిచాడు. భార్యను గాయపరిచిన భర్త వినయ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఇదే కేసులో భారతిని కులం పేరుతో దూషించిన అత్త భూలక్ష్మి, రాజమ్మలపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

బయ్యవరం వార్డు మెంబరు ఆత్మహత్య



మృతుడు గొల్లవిల్లి బాబూరావు (ఫైల్)

కశింకోట, ఆగస్టు 3 : బయ్యవరం వార్డుసభ్యుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బయ్యవరం పంచాయతీలో 4వ వార్డు మెంబరు గొల్లవిల్లి బాబూరావు (45) సర్వే నంబరు 299లో ఉన్న చెరువు స్థలంలో స్వీటు షాపు నిర్మించుకున్నాడు. ఇది అక్రమ నిర్మాణమని తెలియజేస్తూ రెవెన్యూ అధికారులు గతంలో రెండు దపాలు నోటీసులు ఇచ్చారు. ఎంతకీ స్పందించకపోవడంతో మూడో నోటీసు శుక్రవారం ఆ షాపు గోడకు అతికించారు. దీంతో షాపను తొలగించేస్తారేమోనని తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఉదయం 10 గంటలకు బాబూరావు ఉరి వేసుకున్నాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య దుర్గలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా గ్రామంలోని చెరువును ఆక్రమించి అక్రమంగా వేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారందరూ తమ సొమ్ము తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో వార్డు మెంబరు బాబూరావు ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్థులు అంటున్నారు. లేఅవుట్ వేసేందుకు ప్రోత్సహించిన వైసీపీ నాయకుడు చేతులెత్తేయడంతో బాబూరావు మృతి చెందాడని వారంటున్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం



మండల మహేశ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 3 : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి పాతరాజన్నపాలెం గ్రామానికి చెందిన మండల మహేశ్ (32) రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి జారిపడ్డాడు. దీంతో ఇతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు షీలానగర్‌లో గల డెయిరీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మహేశ్‌కు బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు, వైద్యుల సలహాతో అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. ఆదివారం కుటుంబసభ్యుల సమక్షంలో మహేశ్‌కు చెందిన అవయవాలను సేకరించనున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ప్రక్రియ అనంతరం మహేష్ మృతదేహాన్ని గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తాను మరణించి మరొకరికి ఇవ్వడానికి సహకరించిన మహేశ్ కుటుంబసభ్యులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మహేష్ వివాహితుడు. ఇతనికి తల్లి ముత్యాలమ్మ, ముగ్గురు అక్కచెల్లెలు ఉన్నారు. తండ్రి ఎరునాయుడు గతంలో చనిపోయారు.

బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ పలాస చేరే వేళలు సవరింపు

విశాఖపట్నం, ఆగస్టు 3: విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే 18526 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు పలాస స్టేషన్ చేరే సమయాన్ని సవరించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈ రైలు మధ్యాహ్నం 3.00 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.43 గంటలకు పలాస చేరి, తిరిగి అక్కడ నుంచి 6.48 గంటలకు బయలుదేరే విధంగా మార్పు చేసినట్టు పేర్కొన్నారు. సవరించిన వేళలు ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. అలాగే గుణుపూర్ నుంచి సంబల్‌పూర్ సిటీ వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18118) రైలు పలాస నుంచి పలు స్టేషన్లకు చేరే వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్టు వివరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఫార్మా.. ఇదేం ఖర్మ..

» కలుషితమవుతున్న భూగర్భ జలాలు
» ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలు
» తూతూ మంత్రంగా పీసీబీ తనిఖీలు

తరచూ ఫార్మా వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారబోత



పరవాడ మల్లోడిగెడ్డలోకి ఫార్మా వ్యర్థాలు విడిచిపెట్టడంతో నల్లగా మారిన నీరు (ఫైల్‌ఫొటో)

పరవాడ, ఆగస్టు 3: మండలంలోని విశాఖ ఫార్మాసిటీ (రాంకీ) పరవాడ ప్రాంత ప్రజలకు గుదిబండలా తయారైంది. ఇటీవల కొన్ని ఫార్మా యాజమాన్యాలు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నాయి. దీని కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. పీసీబీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు.



ఫార్మా వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్ద చెరువులో మృత్యువాత పడిన చేపలు (ఫైల్‌ఫొటో)

ఫార్మాసిటీలోని కొన్ని కంపెనీల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు పరవాడ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. ప్రాణాలకు హాని కలిగించే వ్యర్థ రసాయనాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతున్నాయి. దీనివల్ల భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు జీవరాసులు కూడా మృత్యువాత పడుతున్నాయి. పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలను పరవాడ మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లడంతో పాటు నీరంతా కలుషితమైన సంగతి తెలిసిందే. ఇదే గెడ్డలోంచి నీరంతా దిగువ ఉన్న పెద్ద చెరువులోకి కలవడంతో అందులో చేపలు మృత్యువాత పడ్డాయి. అలాగే చెరువులోని నీరంతా పూర్తిగా కలుషితమైంది. దీనివల్ల ఆయకట్టు రైతులు చెరువు నీటిని పంటలకు మళ్లించేందుకు వెనుకాడుతున్నారు. చెరువులోకి దిగడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా ప్రబలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. దీనికి అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే పెదముషిడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సమీపంలోని బచ్చల చెరువులో ఫార్మా వ్యర్థాలతో నిండిన డ్రమ్ములను విడిచిపెట్టారు. డ్రమ్ముల్లో గల కొంత వ్యర్థాలను చెరువులోకి పారబోయడంతో చుట్టు పక్కల ఉన్న వారంతా దుర్వాసనకు తట్టుకోలేక విలవిలలాడిపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో డ్రమ్ములను రాంకీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అలాగే మూడు రోజుల క్రితం రాంకీ పంపుహౌస్ సమీపంలో గల గెడ్డలోకి కొన్ని ఫార్మా యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలు విడిచిపెట్టడంతో సమీపంలో ఉన్న తాడి గ్రామస్థులు వ్యర్థ జలాల దుర్వాసన తట్టుకోలేకపోయారు. తరచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యర్థాలను రాంకీలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాత్రి వేళల్లో కాలువల ద్వారా గెడ్డలోకి విడిచిపెట్టి చేతులు దులుపేసుకుంటున్నారు. దీనికి కారణంగా పరవాడతో పాటు పరిసర ప్రాంతాలన్నీ ఫార్మా వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

తూతూ మంత్రంగా పీసీబీ తనిఖీలు

ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నప్పటికీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు (పీసీబీ) అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి, చేతులు దులుపేసుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని యాజమాన్యాలు ఇష్టం వచ్చినట్టు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను విడిచిపెడుతున్నాయి. పీసీబీ అధికారులు నిఘా పెట్టి ఎవరైతే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారో వారిపై క్రిమినల్ కేసులతో పాటు సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలకు పెనాల్టీ, కగాగారం సీజ్ చేసినట్టయితే వారి ఆగడాలకు కళ్లెం పడేది. ఆ దిశగా పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. పీసీబీ అధికారులు ఉదాసీనత కారణంగానే పరవాడ ప్రాంతం ఫార్మా కాలుష్యంతోనే నిండిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఫార్మా యాజమాన్యాల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

మరిడిమాంబ అమ్మవారికి ఆభరణాల వితరణ

» బంగారు పూతతో 50 తులాల వెండి వస్తువులు



అమ్మవారికి ఆభరణాలు వేసి పూజలు చేస్తున్న దాతలు (ఇన్‌సెట్‌లో) అమ్మవారికి వితరణగా ఇచ్చిన వస్తువులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3: గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మ వారికి శనివారం ఇద్దరు దాత ఆభరణాలను వితరణగా అందించారు. ఏఎల్ పురానికి చెందిన ఆటో మెకానిక్ తానారి శివ, ఎలక్ట్రీషియన్ తానారి నాయుడు సుమారు 50 తులాల వెండి ఆభరణాలను తయారీ చేయించి వాటికి బంగారుపూత వేయించి అమ్మవారి ఆలయానికి అందించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ అడ్మిషన్‌లకు 28 చివరి తేదీ

» డీఈఓ వెంకటలక్ష్మమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 28 చివరి తేదీ అని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం జరిగిన సమావేశంలో డిప్యూటీ డీఈఓ పి. అప్పారావు, జిల్లా కో-ఆర్డినేటర్ ఓ. కుమార్, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లు స్వాహా కేసులో నిందితుడి కోసం గాలింపు

» ముమ్మరంగా దర్యాప్తు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేసి పరారైన ప్రబుద్ధుడి కోసం ఎంవీపీ పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్ వ్యవహారాలు చూసేందుకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం బారినపడడంతో 2016లో తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన కుమార్తె ద్వారా కొంతకాలంపాటు వ్యాపారం నడిపించారు. అయితే ఆమె నగరానికి రావడం సాధ్యం కాకపోవడంతో స్టోన్ క్రషర్‌ను నాలుగు కోట్ల రూపాయలకు విక్రయించారు. ఆ సొమ్మును తన ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు, తప్పుడు డాక్యుమెంట్లతో రాధాకృష్ణమూర్తి ఖాతాలోని దాదాపు నాలుగు కోట్ల రూపాయలను అకౌంటెంట్ గోవింద్ తన ఖాతాలకు మళ్లించుకున్నాడు. దీనిపై రాధాకృష్ణమూర్తి ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో రాధాకృష్ణమూర్తి జూన్ 12న అప్పటి సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌ను కలిశారు. అలాగే ఇటీవల ఆయన అల్లుడు అప్పయ్య చౌదరి ప్రస్తుత పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీపీ వెంటనే ఎంవీపీ సీఐ సంజీవరావుకు ఫోన్ చేసి కేసు దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితుడి ఆచూకీ తెలుసుకునేందుకు వారి కుటుంబ సభ్యుల సెల్ ఫోన్ కాల్ డేటా, నిందితుడి బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని ఆదేశించారు.

ఈ మేరకు సీఐ సంజీవరావు శుక్రవారం సీతమ్మధారలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లి బాధితుడి బ్యాంకు ఖాతాతో పాటు నిందితుడి గోవింద్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. తదుపరి దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

మెట్రో రైలుకు మరో అడ్డంకి

» కొత్త మొబిలిటీ ప్లాన్ కోరిన కేంద్రం
» ఇంతకు ముందు సమర్పించిన ప్లాన్‌కు కాలదోషం
» మళ్లీ సర్వేలు, ట్రాఫిక్‌పై అధ్యయనం తప్పనిసరి
» ప్రాజెక్టు ప్రారంభం ఆలస్యం అయ్యే అవకాశం

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కేలాలేదు. వైసీపీ ప్రభుత్వం విశాఖలో మోనో రైలు నడుపుతామంటూ ప్రగల్భాలు పలికింది. అంతకు ముందు ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రివైజ్ చేసి పంపాలని కేంద్ర ప్రభుత్వం కోరితే...నాలుగేళ్లు దానిని తొక్కి పెట్టి ఎన్నికల ముందు సమర్పించింది. దానిని పరిశీలించేలోగా ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారిపోయింది. తాజాగా రాజ్యసభలో ఓ ఎంపీ విశాఖపట్నం మెట్రో రైలు పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నించారు. దానికి దిమ్మ తిరిగే సమాధానం వచ్చింది. ప్రాజెక్టుకు రివైజ్డ్ డీపీఆర్ అయితే పంపించారు గానీ దానికి జత చేసిన కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)కి కాలదోషం పట్టిందని, కొత్తది పంపాల్సి ఉందని తేల్చి చెప్పింది.

ఏమిటీ మొబిలిటీ ప్లాన్?

విశాఖ నగరంలో జనాభా, ప్రజా రవాణా వ్యవస్థకు సంబంధించిన ఏర్పాట్లు, రహదారుల సంఖ్య, వాటి విస్తీర్ణం, వాహనాల సంఖ్య, వార్షిక పెరుగుదల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా చేపట్టిన చర్యలు, మెట్రో రైలు ప్రాజెక్టుతో వాటికి అనుసంధానం ఎలా?...అనే వివరాలు సమర్పించేదే మొబిలిటి ప్లాన్.

తెలుగుదేశం పార్టీ 2017లో విశాఖపట్నం మెట్రో రైలును ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా ప్రకటించింది. 2108లో అధ్యయనం చేసి మొబిలిటీ ప్లాన్ తయారుచేసింది. మొత్తం 42.54 కి.మీ. పొడవున ట్రాక్ నిర్మించాలని ప్రతిపాదించింది. దీనికి అప్పట్లో రూ.8,300 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా సమకూర్చాల్సిన రూ.4,200 కోట్లను దక్షిణ కొరియాకు చెందిన ఎగ్జిమ్ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని భావించారు. టెండర్లు పిలిచారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టు వ్యయం రూ.14,300 కోట్లకు చేరింది. మొబిలిటీ ప్లాన్ కాల పరిమితి ఐదేళ్లు. 2018లో రూపొందించినది కాబట్టి దాని గడువు 2023తో ముగిసిపోయింది. ఈ ప్రాజెక్టు ఇంకా డీపీఆర్ పరిశీలనలో ఉన్నందున కొత్త మొబిలిటీ ప్లాన్ సమర్పించాలని కేంద్రం సూచించింది.ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలని భావిస్తోంది. నగరంలో ట్రాఫిక్ సజావుగా సాగడానికి 12 ఫ్లైఓవర్లు నిర్మించాలని వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించగా జాతీయ రహదారుల సంస్థ వాటికి ఆమోదం తెలిపింది. త్వరలోనే వాటికి టెండర్లను పిలిచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున, ఆ ఫ్లైఓవర్లు, మెట్రో రైలు స్టేషన్లను ఇంటిగ్రేట్ చేస్తూ కొత్త ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విశాఖపట్నం వచ్చినప్పుడు మెట్రో రైలు అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ల నిర్మాణం మంచిదా?, ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే మంచిదా? ఆలోచించి తనకు చెప్పాలని కోరారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇబ్బంది లేకుండా మార్పులు చేయాలని సూచించారు. అంటే కేంద్రం కోరిన మొబిలిటీ ప్లాన్ కూడా ఇందులో కీలకం కానుంది. నగరంలో బీఆర్‌టీఎస్ రహదారులు, వాహనాల సంఖ్య, ఏయే జంక్షన్లలో ఎంతెంత ట్రాఫిక్ ఉంటున్నదీ కొత్తగా అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా మెట్రో రైళ్ల సంఖ్య, వాటికి బస్సుల అనుసంధానం వంటివి సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ పరిశీలించాకే కేంద్రం నుంచి ఆమోదం లభిస్తుంది. అప్పుడు పీపీపీలో చేయడానికి ఎవరు ముందుకు వస్తారనేది తేలుతుంది.

చెక్కపైనా స్నేహితులే



దార్ల రవి ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని చెక్కపై స్నేహితులను తయారు చేసిన దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 3: ఆదివారం ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కపై స్నేహితులదృశ్యాన్ని అద్భుతంగా తయారు చేశారు. కష్టంలో వున్న వారిని ఆదుకోవడానికి నిజమైన స్నేహితులు ఎంత భారమైనా మోస్తారనే భావం వచ్చేలా చెక్కతో స్నేహితులను చిత్రీకరించాడు. దీనిని తయారు చేయడానికి సుమారు గంట సమయం పట్టిందని దార్ల రవి చెప్పాడు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

» ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం కూటమి నేతలంతా కలిసి పనిచేయాలని ఎంపీ సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ క్రియాశీలక నాయకులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలకు జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టినా గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని నేతలకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు కూటమి ప్రభుత్వం గుర్తింపునిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారని, వారి వివరాలను కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నేతలు హాజరయ్యారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించని అధికారులపై కేసులు

» ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దేవరాపల్లి, ఆగస్టు 3: ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించని అధికారులపై కేసులు ఎందుకు పెట్టకూడదంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ప్రశ్నించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.129 కోట్లు బకాయిలు చెల్లించని అధికారులపై ఎందుకు కేసులు పెట్టకూడదన్నారు. 15 రోజులకు ఒక సారి బిల్లులు చెల్లించకుంటే సంబంధిత అధికారులపై కూలీలు కేసులు పెట్టవచ్చని ఉపాధి హామీ చట్టం చెబుతోందన్నారు. అనకాపల్లి మండలంలో రూ.9,33,74,665, వి.మాడుగుల మండలంలో రూ.7,1978483, అచ్యుతాపురం రూ.2,24,10485, బుచ్చయ్యపేట రూ.4,3595072, దేవరాపల్లి మండలం రూ.2,78,89,860, చీడికాడ రూ.4,39109,98, కె.కోటపాడు రూ.4,38,564 చొప్పున జిల్లా వ్యాప్తంగా బకాయిలు కోట రూపాయాల్లో ఉన్నాయన్నారు. ఈసారి బడ్జెట్‌లో కూడా ఉపాధి హామీకి రూ.86 కోట్లుకు కుదించడం అన్యాయం అన్నారు.

వాగులు వంకలు దాటి పింఛన్ పంపిణీ

- ముంచంగిపుట్టు, కొయ్యూరులో సిబ్బంది సాహసం
- మొదటి రోజు 96 శాతం.. రెండు రోజు 99.5 శాతం పూర్తి
- లబ్ధిదారుల చిరునామా వెతుక్కుని వెళ్లి మరీ సొమ్ము అందజేత



కొయ్యూరు మండలంలో కొండవాగు దాటుతున్న సచివాలయ ఉద్యోగులు...



ముంచంగిపుట్టు మండలంలో బిర్రుగూడ గెడ్డ దాటుతున్న సచివాలయ సిబ్బంది

ముంచంగిపుట్టు, ఆగస్టు 3: పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో జోరువాన.. ఈదురుగాలులు.. వరద నీటి ఉధృతిని సైతం లెక్క చేయకుండా ఉద్యోగులు రెండు రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి రోజు ఇంటింటికీ వెళ్లి 96 శాతం పంపిణీ చేయగా, రెండో రోజు లబ్ధిదారులను వెతుక్కుని వెళ్లి మరీ దాదాపు 99.5 శాతం సొమ్ము అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

మన్యంలో దాదాపు 15 రోజుల పాటు ఈదురు గాలులు, కుండ పోత వర్షం కురిసింది. దీంతో ముంచంగిపుట్టు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో పలు చోట్ల వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయిన విషయం తెలిసిందే. బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల పరిధిలో బిర్రుగూడ, ఉబ్బెంగుల, కోడాపుట్టు, కర్లాపొదర్ తదితర ప్రాంతాల్లో గెడ్డలు వరదనీటితో ఉగ్రరూపం దాల్చాయి. అయినప్పటికీ గురువారం పింఛన్ల సొమ్మును పింఛన్లదారులకు ఎలాగైనా అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు బిర్రుగూడ సమీపంలో గెడ్డను దాటి ఉబ్బెంగుల, దొరగూడ తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లదారులకు సొమ్మును అందజేశారు. అలాగే మండలంలో 23 పంచాయతీల పరిధిలో సిబ్బంది జోరువానను సైతం లెక్కచేయకుండా పింఛన్ల పంపిణీకి సాహసోపేతమైన ప్రయాణం చేశారు. దీంతో మండలంలో మొత్తం 6,287 మంది పింఛన్లకుగాను మొదటి రోజు 6,250 మందికి సొమ్ము అందించారు. వాటిలో మిగిలిపోయినవి 37 పెన్షన్లు మరణించిన పింఛన్లదారులవని అధికారులు తెలిపారు. అయితే జోరువానలో సైతం మొదటి రోజు పింఛన్ల పంపిణీ 96 శాతం చేయగా రెండో రోజు 99.5 శాతం పూర్తి చేయడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కిరణ్‌కుమార్ శనివారం అభినందించారు. అలాగే లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల పరిధిలో వాగులు దాటుతూ సాహసోపేతమైన ప్రయాణం చేసి పంఛన్ సొమ్ము అందించిన పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, బోలోలను ఎంపీడీవో ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కొయ్యూరు మండలంలో...

కొయ్యూరు: మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీ గంగవరం, నీలవరం, పాలసముద్రం, నక్కలమెట్ట, సంగంవలస, బంగారుబంద గ్రామాలలో 48 పింఛన్లను పంపిణీ చేసేందుకు సచివాలయ వెల్ఫేర్, వెటర్నరీ అసిస్టెంట్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులను దాటుకుంటూ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే మూడు కొండవాగు ప్రవాహాలు దాటాలి. ఈ పరిస్థితులలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు యు.చీడిపాలెం సచివాలయ వెల్ఫేర్, వెటర్నరీ అసిస్టెంట్‌లు ముర్ల పద్మనాభరాజు, కూడా శ్రీనివాసరావు శనివారం అతికష్టంపై ఈ వాగులను దాటుకుంటూ ఆయా గ్రామాలకు వెళ్లి పింఛన్ అందించారు. ఎంతో సాహసం చేసి ప్రభుత్వ ఆశయం నెరవేర్చిన వెల్ఫేర్, వెటర్నరీ అసిస్టెంట్లను ఎంపీడీవో సీతయ్య అభినందించారు. వాగులు దాటుకుంటూ వచ్చి పింఛను అందచేసిన సిబ్బందికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

న్యాయం చేయాలని దండాలు పెడుతూ నిరసన

- భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపణ

పాడేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ బూరిగ, చిన్నకోనెల గ్రామాలకు చెందిన గిరిజనులు శనివారం కలెక్టరేట్ ముందు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. తమకు చెందిన సుమారు వంద ఎకరాల మెట్టు భూమిని అన్యాయంగా మరొక వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధిత గిరిజనులు కోరారు. భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని తమ ప్రమేయం లేకుండానే చేశారని వారు తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని విన్నవించారు. అనంతరం సమస్యపై కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బాధిత గిరిజనులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి.. మండలాల్లో తల్లిపాల వారోత్సవాలు



సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పీవోలు, సూపర్‌వైజర్లు

అనంతగిరి, ఆగస్టు 3: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు, సీమంతాలు, నెలల నిండిన చిన్నారులకు అన్నప్రసన్నం కార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా ఆరోగ్యం ఉంటారన్నారు. అనంతరం మహిళకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఈడీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి, ఏపీఎం శ్రీరాములు పాల్గొన్నారు.

చింతపల్లి: తల్లిపాల వల్ల శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో జీవీ రమణ అన్నారు. మండలంలోని రౌరింతాడ గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువులకు ఆరు నెలల పాటు తల్లి పాలు పెట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యవతి పాల్గొన్నారు.

కొయ్యూరు: వ్యాధి నిరోధకశక్తి పెంచే తల్లిపాలను ఇస్తే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కొయ్యూరు సీడీపీవో విజయకుమారి సూచించారు. శనివారం సురేంద్రపాలెం, లూసం, ముకుడుపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇచ్చే పద్ధతి, మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు మహాలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలను తప్పనిసరిగా నిర్వహించాలని వైద్యాధికారులు రవిచంద్రశేఖర్, శశికాంత్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తల్లి ప్రాధాన్యంపై వారు అవగాహన కల్పించారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీల కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. బాలింతలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాల నిర్వహించారు. తల్లి పాల వల్ల కలిగే లాభాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయఉమా, సీడీపీవో నీలిమ, ఎంపీఈవో శౌరి, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: శిశువులకు ఆరు నెలల పాటు తల్లిపాలు కచ్చితంగా పెట్టాలని సీడీపీవో లక్ష్మీదేవి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలతోనే శిశువులకు ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు శిశువులకు పాలు ఇచ్చేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కల్పించండి

ప్రతీ కార్యాలయంలో ఫిర్యాదుల విభాగం ఉండాలి

విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ





సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

చింతపల్లి, ఆగస్టు 3: ఆదివాసీలకు హక్కులపై అవగాహన కల్పించాలని విశాఖపట్నం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో శివారు గ్రామాల ఆదివాసీలకు సైతం ప్రభుత్వ సేవలు, పథకాలు శతశాతం అందాలన్నారు. వివిధ శాఖ అధికారులు ఆదివాసీలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యవంతులను చేయాలన్నారు. అర్ధ రాత్రి వేళ ఆదివాసీలకు అనారోగ్యం కలిగినా, గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినా సకాలంలో వైద్యం అందించాలన్నారు. తల్లిదండ్రుల ఆస్తులపై మహిళలకు సైతం సంపూర్ణ హక్కు ఉంటుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టంపై ఐసీడీఎస్ అధికారులు, మహిళా కానిస్టేబుళ్లు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో కచ్చితంగా ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం రౌరింతాడలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు సౌమ్య, దినేశ్‌కుమార్ 250 మందికి పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే చింతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకుని విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జుడిషియల్ ప్రథమ శ్రేణి న్యాయ స్థానం న్యాయమూర్తి మధుసూదన్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీ డీవో వీర సాయిబాబు, ఎంఈవో పనసల ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు, బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.సత్యనారాయణ, సీఐ రమేశ్, ఎస్ఐ అరుణ్ కిరణ్, హెచ్ఎం కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

ముంచంగిపుట్టు, ఆగస్టు 3: గిరి రైతులు మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి సూచించారు. శనివారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ మండలంలో 25 మినీ గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. 90 శాతం రాయితీపై గోకులాలు నిర్మాణాకి ఉపాధి పథకం ద్వారా బిల్లులు అందించనున్నట్టు చెప్పారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువపత్రం, 1ఏ ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, జాబ్‌కార్డు, ప్రస్తుత ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు జెరాక్స్‌లు, రూ.50 నాన్ జ్యుడిషియల్ డిక్లరేషన్ స్టాంప్ పేపర్‌తో పాటు గోకులం నిర్మించుకునే స్థలం ఫొటో, దరఖాస్తుదారుడి పాస్ ఫొటోలతో పాటు గ్రామ సభ తీర్మానాన్ని కలిపి పశు వైద్య సిబ్బందికి అందించాలని ఆమె తెలిపారు. దరఖాస్తులు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, పూర్తి సమాచారానికి పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

సంగడ ప్రధాన రోడ్డుపై కూలిన భారీ వృక్షం

- ఇరువైపులా స్తంభించిన వాహన రాకపోకలు



ప్రధాన రహదారిపై కూలిపోయిన చెట్టు

ముంచంగిపుట్టు, ఆగస్టు 3: మండల కేంద్రం నుంచి సంగడ వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం భారీ వృక్షం నేలకూలింది. దీంతో అటుగా వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై చెట్టుపడి పోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయిపోయింది. సాయంత్రం వరకు ఆ చెట్టును తొలగించడంలేదు. దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఒడిశాకు చెందిన అంబులెన్స్‌లో రోగిని ఆస్పత్రిలో దించి తిరుగు ప్రయాణంలో ఆ చెట్టు వద్ద గంటల తరబడి ఉండిపోవాల్సి వచ్చింది. వేరే మార్గంలో వాహనం తరవాత వెళ్లిపోయింది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మట్టి పటుత్వం కోల్పోడంతో చెట్టు పడిపోయినట్టు తెలిసింది. ఆ మార్గంలో మరిన్ని చెట్లు అలానే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి సంఘటనా స్థలానికి వెళ్లి ఆ చెట్టును పరిశీలించారు. అధికారులకు సమాచారం అందించారు. అయితే చెట్టుని తొలగించేందుకు తమవంతు సహకారం అందిస్తామని ఆమె తెలిపారు.

బొర్రా గుహలు పరిరక్షణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ స్థానిక బొర్రాగుహలు గైడ్స్ ఎంప్లాయిస్, మోటారు యూనియన్లు, ట్రో సంస్థ ప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రం తనకు అందిందని, ఈ మేరకు ఈ అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావిస్తానన్నారు. సహజసిద్ధ బొర్రాగుహలును పరిరక్షించడం, కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. అరకు ఎంపీగా బొర్రాగుహలును కాపాడాల్సిన బాధ్యత తనపై కూడా ఉందని తనుజారాణి అన్నారు. రైల్వే ట్రాక్ నిర్మాణంతో బొర్రాగుహలుకు వచ్చే నష్టాన్ని వివరిస్తానన్నారు. అలాగే బొర్రాగుహలుపై ఉన్న పాత రైల్వే ట్రాక్‌ను కూడా మార్చాలని డిమాండ్ చేస్తానన్నారు. రైల్వే ట్రాక్ అలైన్‌మెంట్ మార్పు చేయాలని పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్తున్నట్టు ఎంపీ తనుజారాణి తెలిపారు. అలాగే ప్రత్యేకంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడతానన్నారు.

పట్టాలెక్కనున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు వినియోగంలోకి వస్తే మరో 1,350 మెగావాట్ల సామర్థ్యం పెరగనుంది. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సులో మాచ్‌ఖండ్‌లో ఆంధ్రా వాటాగా 60 మెగావాట్లు, సీలేరులో 240 మెగావాట్లు, డొంకరాయిలో 25 మెగావాట్లు, పొల్లూరులో 440 మెగావాట్లతో కలిసి 765 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉంది. తాజాగా సీలేరులో ఏర్పాటు చేయనున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు 1,350 మెగావాట్లు సామర్థ్యంతో కలిపి 2,115 మెగావాట్ల సామర్థ్యానికి పెరిగి రాష్ట్రంలోనే విద్యుదుత్పత్తిలో సీలేరు అగ్రగామిగా నిలవనుంది.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై సదస్సులు

- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం కలిగించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించారు. అలాగే గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఆగస్టు 15వ తేదీలోగా మూడు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్యారోగ్య శాఖ, ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. అలాగే విశాఖ జిల్లా న్యాయ సేవాప్రాధికార సంస్థ కార్యదర్శి సూచనల మేరకు సంబంధిత అధికారులకు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గిరిజన హక్కుల పరిరక్షణకు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే చేటు, తదితర అంశాలపై స్వచ్ఛంద సంస్థల సహకారంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే లీగల్ సెల్ ఆథారిటీ ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచిత న్యాయ సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. గిరిజన మహిళలు లీగల్ సెల్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయ సలహాలు, సూచనలు వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయించాలని శ్రావణ్‌కు వినతి



శ్రావణ్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పాడేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ జీసీసీ కాంట్రాక్ట్ సేల్సుమన్‌లు టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు సమర్పించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసి తమ సమస్యలను వివరించారు. ఇన్నాళ్లుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగిస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. జీసీసీని బలోపేతం చేసేందుకు గతంలోనూ ప్రభుత్వం కృషి చేసిందని, ఇకపైనా జీసీసీని పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. అలాగే జీసీసీలో కాంట్రాక్ట్ సేల్సుమన్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం

తమను రెగ్యులర్ చేసేందుకు కృషి చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి జీసీసీలో కాంట్రాక్ట్ సేల్సుమన్‌లు శనివారం ఇక్కడ వినతిపత్రం సమర్పించారు. ఇన్నాళ్లుగా పని చేస్తున్న తాము రెగ్యులర్ కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ సేల్సుమన్‌లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వాణిజ్య సరళిలో వ్యవసాయానికి ప్రోత్సాహం

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి



శాస్త్రవేత్తలు, ఏవోల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి

చింతపల్లి, ఆగస్టు 3: గిరిజన ప్రాంతంలో వాణిజ్య సరళిలో వ్యవసాయం చేపట్టేందుకు ప్రోత్సహిస్తున్నట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి చెప్పారు.పరిశోధన స్థానంలో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులతో నెలవారి శిక్షణ, సందర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ ఆదివాసీ రైతులు వ్యవసాయం ద్వారా అధిక లాభాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేసి ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉన్నదన్నారు. అధిక ఆదాయం సమకూర్చే వ్యవసాయ, ఉద్యాన పంటలు, నూతన వంగడాలను రైతులకు పరిచయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల వ్యవసాయ ప్రగతికి అవసరమైన సాంకేతిక సహకారం పూర్తి స్థాయిలో అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద మాట్లాడుతూ రైతులు విత్తనం నాటిన నుంచి పంట కోసే వరకు వ్యవసాయ సహాయకుల సహకారం తీసుకోవాలన్నారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన నూతన సాగు విధానాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రైతులు మిరియాలు, కాఫీ, అల్లం, పసుపు పంటల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కంటా జాహ్నవి, శాస్త్రవేత్తలు బయ్యపురెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి, ఉజ్వలరాణి, పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

బాలరేవులకు పట్టిపీడిస్తున్న నీటి సమస్య

కొయ్యూరు, ఆగస్టు 3: బూదరాళ్ల పంచాయతీలోని బాలరేవులులో తాగునీటి సమస్య వేధిస్తోంది. ఈ గ్రామంలో 60 కుటుంబాలకు చెందిన 250 మంది జనాభా ఉన్నారు. వీరికి తాగునీటి సదుపాయం లేక 800 మీటర్ల దూరంలో ఉన్న పొలాల నుంచి నీరు తెచ్చుకొని తాగుతున్నారు. ఇది బురదగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తమ గ్రామానికి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చినప్పుడు 20 రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని, అయితే అది నెరవేరలేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సమస్య గురించి అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు ఇచ్చామని తెలిపారు. కానీ తమ సమస్యకు పరిష్కారం మాత్రం లభించలేదని వాపోయారు. అయితే తమ గ్రామ తాగునీరు సమస్యను స్పందించిన పోలీసులు కొంత తాగునీటి పథకం కల్పించారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఆ పథకంతో లభిస్తున్న తాగునీరు సరిపోవడం లేదని చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు వేడుకున్నారు.

సంక్షిప్తంగా..

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం

అరకులోయ, ఆగస్టు 3: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో మోహన్‌రావు తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి చదవడం, రాయడవం వచ్చినవారు, పదో తరగతి పరీక్ష తప్పినవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీవరకు ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. గడువు దాటితే రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబరు 9వ తేదీవరకు ప్రవేశాలకు అవకాశం ఉందని చెప్పారు.

డ్రాప్ అవుట్ విద్యార్థులకు ఓపెన్ స్కూల్ సదవకాశం

డుంబ్రిగుడ, ఆగస్టు 3: చదువుతూ వివిధ కారణాలతో మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు శారదా విద్యా పీఠం ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విధానం మంచి అవకాశమని కోఆర్డినేటర్ జి.దాసుబాబు చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ విధానంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వయస్సు 15 ఏళ్లు ఆఅటిన, టెన్త్, ఇంటర్ మధ్యలో మానేసిన విద్యార్థులతో పాటు చదువుకోవడానికి ఆసక్తి ఉన్నా వారిని కూడా ఓపెన్ స్కూల్‌లో జాయినింగ్ చేసి విద్యను కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

డుంబ్రిగుడ, ఆగస్టు 3: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌బీ.పోతురాజు డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరాలు తదితర వ్యాధులు సోకడంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఐదేళ్ల నుంచి వారిని విధుల నుంచి తొలగించడంతో సకాలంలో వైద్య సేవలు అందక విద్యార్థులు మృతి చెందుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

కొయ్యూరు, ఆగస్టు 3: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ గిరిజనులకు సూచించారు. శుక్రవారం సిబ్బందితో కలసి బూదరాళ్ల, మర్రివాడ పంచాయతీల్లోని సాకులపాలెం, లూసం గ్రామాలను సందర్శించి చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గంజాయి జోలికి వెళ్లి జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చెడు వ్యసనాలతో ముప్పు

సీలేరు: చెడు వ్యసనాలతో పెను ముప్పు పొంచివున్నదని సీఐ అప్పలనాయుడు చెప్పారు. సప్పర్ల వారపు సంతలో శనివారం మూరుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజన యువకులను సీఐ కలసి వర్షాలతో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల పొంగి ప్రవహిస్తున్న వాగుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎవరికైనా ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితులు నెలకొంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రమాదకరంగా ప్రవహించే గెడ్డల్లో ప్రాణాలకు తెగించి దాటవద్దని ఆయన సూచించారు.

లార్వా దశలోనే దోమల నియంత్రణ

చింతపల్లి, ఆగస్టు 3: గ్రామాల్లో దోమలను లార్వా దశలోనే నియంత్రించాలని ఎంపీడీవో వి.వీరసాయిబాబు సూచించారు. అన్నవరం గ్రామ పంచాయతీలో శనివారం యాంటీ లార్వా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువలు, నీరు నీరు ఉన్న ప్రాంతాల్లో లార్వా నాశనం చేసే మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లార్వా దశలో అరికట్టకపోతే దోమల ఉధృతి పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడతారన్నారు. అలాగే గ్రామాలు, వీధుల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీడితోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

అనంతగిరి, ఆగస్టు 3: జీడితోటల పెంపకంతో గిరిజన రైతులు ఆర్థికంగా ఎదుగుతారని ఎంపీడీవో నగేష్ సూచించారు. మండలంలోని చిలకలగెడ్డ వద్ద జీడిమామిడి మొక్కలను శనివారం పంపిణీ చేశారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఏపీడీ పవన్, ఏపీవో సన్యాసినాయుడు, టీఏ కొండలరావు, పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలని ఆందోళన

అనంతగిరి, ఆగస్టు 3: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే గిరిజనులతో కలిసి జడ్పీటీసీ గంగరాజు ఆందోళన చేశారు. రొంపల్లి పంచాయతీ కరకవలస గ్రామానికి చెందిన 30 కుంటుబాల గిరిజనులు గత 19 ఏళ్లుగా పోడు భూములు సాగుచేసుకుంటున్నారని, 2005 అటవీ హక్కు చట్ట ప్రకారం వెంటనే వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యంకు పోడు భూములకు దరఖాస్తులను అందజేశారు.

మత్స్యగెడ్డపై వంతెన నిర్మించరూ..

ముంచంగిపుట్టు, ఆగస్టు 3: సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని గిరిజన సంఘం జిల్లా నేత కె.త్రినాథ్ కోరారు. శనివారం మత్స్యగెడ్డపై నాటు పడవలో ప్రయాణించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యగెడ్డపై వంతెన లేక గెడ్డ దాటేందుకు నాటు పడవలను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఫలితంగా ప్రమాదాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో నాటు పడవ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోన సంఘటనలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. సంఘం నాయకులు ఎం.ఎం.శ్రీను, పి.భీమరాజు, కె.బాలు పాల్గొన్నారు.

దేవాలయానికి స్థలం కేటాయించాలి

చింతపల్లి, ఆగస్టు 3: మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మం దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ హనుమాన్ జంక్షన్‌లో వీరబ్రహ్మం దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.